బురాన్‌ఖాన్ చెరువు పరిధిలో అధికారుల సర్వే

- అడ్డుకున్న స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట, మే 30 : జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బురాన్‌ఖాన్ చెరువు పరిధిలోని ముంపు ప్రాంతాల్లో సర్వే చేసేందుకు వచ్చిన మున్సిపల్, రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులను స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. ముంపు పేరుతో ప్రజలను తరలించడానికి మరోసారి సర్వే చేసేందుకు వచ్చారని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేది ఆరోపించారు. ఇంటింటికీ వెళ్లి ఇండ్ల దగ్గర మార్కింగ్ ఇస్తున్నారని, ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రెండేండ్ల క్రితం భారీ వర్షాలకు ఉస్మాన్‌నగర్ బస్తీ నీట మునిగిపోయిందని, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చొరవతో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి పైపులైన్లు వేయించారన్నారు. అయితే ముంపు ప్రజలకు న్యాయం చేసిన తర్వాతే సర్వే చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా? చేస్తారని బస్తీ వాసులు సైతం అధికారులను నిలదీశారు.

ఎల్ఓసీ అందజేత

బాధితుడు మల్లేశ్‌యాదవ్‌కు ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్,మే 30: రోగులకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రామంతాపూర్ డివిజన్ బాలాజీనగర్‌కు చెందిన మల్లేశ్ యాదవ్‌కు ముఖ్యమంత్రి సహాయం నిధి నుంచి మంజూరైన 1 లక్షా 50 వేల ఎల్ఓసీ పత్రాన్ని ఆయనకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు, పవన్‌కుమార్,చాంద్‌పాష, సూరం శంకర్, పాపిరెడ్డి, ఆనంద్, టోని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే

ముంపు సమస్యలు పరిష్కరిస్తాం

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న న్యూగడ్డిఅన్నారం కాలనీవాసులు

ఎల్బీనగర్, మే 30 : వరద ముంపు సమస్యల నుంచి కాలనీవాసులకు శాశ్వత విముక్తి కల్పిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం గడ్డిఅన్నారం డివిజన్‌లోని న్యూ గడిఅన్నారం కాలనీవాసులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. తమ కాలనీలో చిన్న పాటి వర్షానికే డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోందని, నూతన డ్రెయిన్ నిర్మించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నికల కోడ్ రాకముందే న్యూగడ్డి అన్నారం కాలనీతోపాటు పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలను తొలగించేందుకు నూతన డ్రెయిన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. కోడ్ రావడంతో టెండర్ల పక్రియ ఆలస్యమైందని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే టెండర్లు పిలిచి డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా వరదముంపు సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు రఘుప్రసాద్, రామ్మోహన్ రాజు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు చేయూతనందించాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్ లేఖ

సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను చూపుతున్న సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్

ఆర్కేపురం, మే 30 : కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు వద్దని, ఉచిత విద్య, వైద్యం, రైతులకు చేయూత అందించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పిల్లల చదువులు భారంగా మారాయన్నారు. ప్రైవేట్ పాఠశాలలో రూ.1.5 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఉందని, సాధారణ పాఠశాలల్లో ఇది దాదాపు రూ. 60వేల వరకు ఉందన్నారు. లక్షల్లో ఫీజులు కట్టడం ప్రజలకు తలకు మించిన భారమైందని పేర్కొన్నారు. ప్రజా పాలన సాగిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల్లో దోపిడీని నియంత్రించాలని కోరారు. తక్షణమే ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి విద్యా దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. తాను వారం రోజులుగా వందలాది మందిని కలువగా ఆరు గ్యారంటీల కంటే ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, రైతన్నలకు సమయానికి ఎరువులు, విత్తనాలు, నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపునకు ప్రత్యేక వాహనం కేటాయించండి..

చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలిస్తున్న హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, శానిటేషన్ సిబ్బంది

హయత్‌నగర్, మే 30 : ఇటీవల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అనేక చెట్ల కొమ్మలను విరిగి పడ్డాయని, వాటిని తొలగించడానికి శానిటేషన్ అధికారులు ప్రత్యేక వాహనాన్ని కేటాయించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కోరారు. గురువారం హయత్‌నగర్ డివిజన్‌లోని ఓల్డ్ విలేజ్, సాయి కాలనీల్లో శానిటేషన్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడి కాలనీవాసులకు ఇబ్బందిగా మారాయన్నారు. వాటిని తొలగించేందుకు అధికారులు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేస్తే చెట్ల కొమ్మలను సులువుగా తొలగించవచ్చని పేర్కొన్నారు. ఆయన వెంట శానిటేషన్ జవాన్ లక్ష్మయ్య,సూపర్‌వైజర్లు నగేశ్, మల్లేశ్, కాలనీవాసులు ఉన్నారు.

పైపులైన్లలో వ్యర్థాలు, పూడిక తొలగింపు

సన్‌షైన్ కాలనీలో డ్రైనేజీలో వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు

సైదాబాద్, మే 30 : సైదాబాద్ డివిజన్ పరిధి సన్‌షైన్ కాలనీలో మురుగును శాశ్వతంగా తొలగించడానికి జలమండలి అధికారులు తగిన చర్యలు చేపట్టారు. గురువారం జలమండలి, జీహెచ్ఎంసీ సైదాబాద్ అధికారులు సన్‌షైన్ కాలనీలో నీరు కలుషితం కావడానికి గల కారణాలను పరిశీలించారు. పైప్‌లైన్లలో వ్యర్థాలు, పూడిక మూలంగా మురుగునీరు సక్రమంగా వెళ్లడంలేదని గుర్తించారు. వెంటనే సిబ్బందితో తొలగింపు పనులను చేపట్టారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవటానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో జలమండలి సైదాబాద్ మేనేజర్ ఎన్. శ్రవణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సన్‌షైన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ పీహెచ్‌సీలో అల్ట్రాసౌండ్ సేవలు షురూ..

మేడ్చల్ కలెక్టరేట్, మే 30 : ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రా సౌండ్ సేవలను గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ రఘునాథ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలపై ఆధారపడిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో అల్ట్రాసౌండ్ సేవలను ప్రారంభించామన్నారు. ప్రతి బుధ, శుక్ర, శనివారాల్లో అల్ట్రా సౌండ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నారాయణరావు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ పుష్పాంజలి, వైద్యాధికారి సౌందర్యలత పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పూర్తి చేయాలి

బడంగ్‌పేటలో ఎస్ఎన్‌డీపీ నాలా పనులపై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న తానీల్దార్ మాధవిరెడ్డి

బడంగ్‌పేట, మే 30 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులను గురువారం బాలాపూర్ తాసీల్దార్ మాధవిరెడ్డి, డీటీ మైపాల్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి గంగరాజు పరిశీలించారు. కొంతమేర నాలా పనులు నిర్వహించి మధ్యలో నిలిపివేశారు. నాలా ఎక్కడ నుంచి తీయాలన్న సమస్య ఎదురైంది. దాంతో చెరువు నక్ష ప్రకారం పనులు చేపట్టాలని తాసీల్దార్, ఇరిగేషన్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులు ఇప్పుడు నిలిపివేస్తే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడతారని, త్వరగా పనులు పూర్తిచేయించాలన్నారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా పనులు నిర్వహించాలని సూచించారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

సంతోష్‌నగర్‌లో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సైదాబాద్, మే 30 : సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంతోష్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను, వారి ప్రయోజనాలను సంరక్షణించడమే లక్ష్యంగా సీఐటీయూ పనిచేస్తుందన్నారు.

కార్మిక వర్గాన్ని మరింత బలోపేతం చేస్తూ వారి పక్షపాతిగా పనిచేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, యుగంధర్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, నిర్మల, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలి

సాహెబ్‌నగర్ వీకర్‌సెక్షన్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మే 30 : సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్ కాలనీలో డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం వీకర్ సెక్షన్ కాలనీ, బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాల్లో జల మండలి మేనేజర్ భవ్య, కాలనీవాసులతో కలిసి పర్యటించిన కార్పొరేటర్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి ఇటీవల భూగర్భ డ్రైనేజీని మంజూరు చేయించామని, పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బస్తీ వాసులు సత్యనారాయణ, జగన్, ముఖేశ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వనస్థలిపురం కాపు సంఘం నాయకులు

వనస్థలిపురం, మే 30 : చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని వనస్థలిపురం కాపు సంఘం నాయకులు అన్నారు. ఈ నెల 4న సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన చిన్నారుల వేసవి శిక్షణ శిబిరం గురువారం సంబురంగా ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30మంది చిన్నారులు వేసవి శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. వారికి ఆటపాటలతోపాటు, మన సంస్కృతి, సంప్రదాయాలు, దేశీయ సంగీతంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. డ్రాయింగ్, పెయింటింగ్, జనరల్ నాలెడ్జ్‌లో శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కార్యక్రమంలో కాపు సంఘం గౌరవ చైర్మన్ ఎల్.అంజిప్రసాద్, అధ్యక్షుడు ఎన్ఎస్ఎస్ నాయుడు, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లతో చిన్నారులు

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కీసరలో ఫర్టిలైజర్ షాప్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మేరిరేఖ

కీసర, మే 30: రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి మేరిరేఖ తెలిపారు. మండల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించి రైతులకు పంపిణీ చేస్తున్న పచ్చిరొట్టే విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం 347 క్వింటాళ్ల పచ్చిరొట్టే విత్తనాలను సహకార సంఘాల ద్వారా అందిస్తున్నామన్నారు. మండలంలోని ఫర్టిలైజర్ షాప్ యజమానులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

కీసరలోని శ్రీ సాయి ఫర్టిలైజర్‌షాప్, ధన లక్ష్మీ హోం ఫర్టిలైజర్ షాప్‌లను వ్యవసాయాధికారి తనిఖీ చేశారు.

ఆర్టీసీ మేడ్చల్ డిపోలో ఆరోగ్య శిబిరం

మేడ్చల్, మే 30 : మేడ్చల్ ఆర్టీసీ డిపోలో గురువారం వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు గురువారం మేడ్చల్ డిపోలో ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ 2 కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 5 వరకు శిబిరం జరుగుతుందని, ప్రతి ఉద్యోగికి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, డిపో ఉద్యోగులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సిల్వర్ క్రిస్ట్ అసోసియేషన్ సభ్యులు

కాప్రా, మే 30: కాప్రాడివిజన్‌కు చెందిన సిల్వర్ క్రిస్ట్ కాలనీ నూతనకమిటీ సభ్యులు గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనకు పూలమొక్కను అందజేసి, శాలువాతో సత్కరించారు. కాలనీ నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సిల్వర్ క్రిస్ట్ కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యేకు కాలనీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరి నవీన్‌గౌడ్, సిల్వర్ క్రిస్ట్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలు రజిత, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తాం..

ఉప్పల్, మే 30 : ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం శ్రమిస్తామని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చారిజ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు.ఉప్పల్‌లో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల ప్రజలు పలు సమస్యలను ఆయనకు తెలియజేశారు. అనంతరం సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రాలు అందజేశారు.

నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

- పట్టించుకోని అధికారులు.. ప్రజాధనం వృథా!
- అందుబాటులోకి తేవాలని కందుకూరు వాసుల వినతి

కందుకూరులో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కూరగాయల మార్కెట్ షెడ్

కందుకూరు, మే 30 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం కందుకూరు మండలకేంద్రంలో రూ. 29లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ షెడ్ నిరుపయోగంగా ఉంటున్నది. దాంతో ప్రజాధనం వృథా అవుతున్నదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మండలంలోని రైతులు, వ్యాపారులు రైతులు గత కొన్నేళ్లుగా కూరగాయలు, పండ్లు రోడ్డుపైనే విక్రయించేవారు. వానకు, ఎండలకు ఇబ్బందిపడుతూ కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకోవాల్సి వస్తున్నదని, షెడ్డు ఏర్పాటు చేయాలని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అప్పటి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి రూ. 29 లక్షల నిధులను మంజూరు చేయించడంతో మండలకేంద్రంలో కూరగాయల షెడ్డు నిర్మాణ పనులను పూర్తి చేశారు. మార్కెట్ షెడ్డును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించి ఇప్పటికే ఎనిమిది నెలలైంది. అయినప్పటికీ నేటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడం గమనార్హం. ఫలితంగా మార్కెట్ షెడ్డు నిరుపయోగంగా ఉండి కుక్కలు, పందులు, కోతులకు నిలయంగా మారింది. మండల పరిషత్ కార్యాలయాల పక్కనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. మార్కెట్ షెడ్డులో కూరగాయలు విక్రయించడానికి సరైన వసతులను కల్పించి తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి..

కూరగాయల మార్కెట్ షెడ్డును తక్షణమే వినియోగంలోకి తీసుకరావాలి. విక్రయదారులు నేటికీ రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులు, వ్యాపారులు కూరగాయలను రోడ్డుపైన విక్రయించకుండా మార్కెట్‌లోనే విక్రయించేలా చర్యలు తీసుకుని వినియోగంలోకి తీసుకరావాలి.

సాద మల్లారెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి, కొత్తగూడ

అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం..

సమావేశమైన చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేజ్ 3 సీఐఏ ప్రతినిధులు, ఐఓసీఎల్ ప్రతినిధులు

చర్లపల్లి, మే 30: చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్ 3లో అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటున్నామని పారిశ్రామికవాడ ఫేజ్-3 అధ్యక్షుడు మియ్యాపురం రమేశ్, ఐఓసీఎల్ పరిశ్రమ ప్రతినిధి రహుల్‌గుప్తాలు పేర్కొన్నారు. పారిశ్రామికవాడలోని ఇండియన్ అయిల్ కార్పొరేషన్ ఆఫ్ లిమిటెడ్, పారిశ్రామికవాడ ఫేజ్ 3 సీఐఏ ప్రతినిధులు, ఐలా ప్రతినిధులు ఐఓసీఎల్ పరిశ్రమలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామికవాడలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా చమురు పరిశ్రమల లారీలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. అనంతరం సీఐఏ ఉపాధ్యక్షులు సురేశ్, బాబా అలీ, కోశాధికారి సతీష్‌బాబు,చర్లపల్లి ఐలా కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి పలు సూచనలు చేశారు. పారిశ్రామికవేత్తలు, సీఐఏ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు

ఉప్పల్, మే 30: ఇంటి నిర్మాణ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తీసుకుంటామని ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు హెచ్చరించారు. వ్యర్థాలు వేసేవారికి అవగాహన కల్పించడానికి పలు కూడళ్లు, ప్రధాన రహదారుల్లో ప్లెక్సీలను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి, సీసీ కెమరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వ్యర్థాలను సంబంధిత అధికారులకు తెలియజేసి, రుసుము చెల్లించడం ద్వారా తీసుకువెళ్తారని పేర్కొన్నా రు. నిబంధనలు పాటించి, అధికారులకు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు కరెంట్ సరఫరా ఉండని ప్రాంతాలు

హయత్‌నగర్, మే 30: ఇటీవల ఈదురుగాలులు, భారీ వర్షానికి విరిగిపడిన చెట్ల కొమ్మలను తరలించే క్రమంలో హయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని హయత్‌నగర్ ఏఈ బి.ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విజయనగర్ కాలనీ ఫీడర్, 33/11కేవీ మదర్ డెయిరీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రగతినగర్, విజయనగర్ కాలనీ, బృందావన్ కాలనీ, వినాయకనగర్, లింగమయ్య వెంచర్, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో, 11కేవీ శివం హిల్స్, 33/11కేవీ మదర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రియదర్శిని కాలనీ, ప్రగతినగర్, సీఎస్ఆర్ కాలనీ, నాగార్జునకాలనీ, వర్ధానగర్, దుర్గానగర్, శివంహిల్స్, విష్ణునగర్, రాజరాజేశ్వరి కాలనీ, ఎల్లారెడ్డి కాలనీ, పవనగిరి కాలనీ, కెవీఎన్‌రెడ్డినగర్, శ్రీరామ్ నగర్ శ్రీక్రిష్ణ హిల్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పేర్కొన్నారు.

ఆర్కేపురం పరిధిలో...

ఆర్కేపురం : శివం హిల్స్ 33/11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సరూర్‌నగర్ డీఈ కె.రామకృష్ణ తెలిపారు. మోహన్‌నగర్, లక్ష్మీనగర్, భగత్‌సింగ్ నగర్, లింగోజీగూడ, మారుతినగర్, అష్టలక్ష్మి, తట్టిఅన్నారం, హౌసింగ్ బోర్డు, ఆటోనగర్, హైకోర్టు కాలనీ, పెద్దఅంబర్‌పేట్, పెద్దఅంబర్‌పేట్‌టౌన్, మధర్‌డైరీ, విజయ్‌నగర్ కాలనీ, మారుతినగర్, ప్రజయ్‌నివాస్, రంగారెడ్డి కోర్టు, సరూర్‌నగర్ స్టేడియం, ఖిల్లామైసమ్మ, నాగోల్, మారుతినగర్, బంజార కాలనీ, చిత్రలేఅవుట్, పెద్దఅంబర్‌పేట్, కోహెడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో..

సైదాబాద్ : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈ హనుమంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గౌతంనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు, 11 కేవీ జీఏ బ్యాంక్‌కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11కేవీలక్ష్మినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, 11కేవీ పూర్ణోదయ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సందర్భం ఏదైనా నమస్తే తెలంగాణ ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
నమస్తే తెలంగాణలో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
అంత్యక్రియలు వర్